# భవదీయుడు

"వెళ్ళొస్తానమ్మా" అని అమ్మతో అన్నప్పుడు ఆమె కళ్ళలో సన్నటి నీటి పొర.

'నీ లేత భుజాల మీద కొండంత బరువు బాధ్యతల్ని మోయాల్సిన అగత్యం రావటం నేను చూడలేకున్నానురా' అంటున్నట్లు ఆమె కళ్ళలో పెల్లుబుకుతున్న నీళ్ళను నాకు కన్పించకుండా ముఖం పక్కకు తిప్పుకుంది.

నా వైపు మెరిసే కళ్ళతో చూస్తూ నిలబడి ఉన్నారు - చెల్లెలూ - ఇద్దరు తమ్ముళ్ళూ . . . ఆకలితో, అనారోగ్యాలతో నీరసించిన వాళ్ళ శరీరాల్లో జ్వలిస్తున్న ఆశను వ్యక్త పరుస్తూ వింత వెలుగు . . .

కలచి వేస్తున్న మనసుతో రైల్వే స్టేషన్ వైపు నడకసాగించాను. ఇక్కడ నుండి నాలుగు గంటల ప్రయాణం హైదరాబాద్ చేరటానికి.

ఓసారి జేబును తడుముకున్నాను. చేతికి కవరు తగిలింది - బరువుగా -

దాన్ని అలా తడుముకుంటుంటే ఉద్యోగం నా అరచేతిలో ఉన్నంత ఆనందంగా ఉంది.

నాన్నగారి మరణం తర్వాత మిగిలింది రెండుగదుల ఆ పాత పెంకుటిల్లు - వూరి నిండా అక్క పెళ్ళి కోసం చేసిన అప్పులు - తన సత్ప్రవర్తనతో సంపాదించుకున్న మంచిపేరు.

ఆ మంచి పేరు ఈ రోజు నాకు అక్కరకు వచ్చింది.

మా వూరి ఎమ్మెల్యే కృపానిధి మా నాన్నగారి దగ్గర చదువుకున్న వారే - ఎటొచ్చీ ఏడో తరగతిలో చదువు మానేసి - తర్వాత సారా కాంట్రాక్టుల్లో లక్షలు గడించి ఈ రోజు ఎమ్మెల్యే అయ్యాడు. హైదరాబాద్‌లో ఒకరిద్దరు మినిష్టర్లు వీరికి సన్నిహితులట. మా వూళ్ళో కొంతమందికి ఉద్యోగాలిప్పించిన మహానుభావుడాయన.

అందుకే ఓరోజు ముకుళిత హస్తాల్తో కృపానిధిగారి ముందు నిలబడి నా పరిచయం చేసుకున్నాను.

"నువ్వటోయ్ - శాస్త్రి గారి అబ్బాయివి! ఆ రోజుల్లో శాస్త్రి మాష్టారంటే మేము హడలి

చచ్చే వాళ్ళం. రా . . . రా . . . ఇక్కడ కూచో" అని ఆప్యాయంగా తన పక్కన సోఫాలో కూచో బెట్టుకున్నారు.

నేను బిడియంగా కూచున్నాను.

"అదేమిటి అలా సిగ్గు పడ్తావు! నీవు మా గురుపుత్రుడివి. అంటే నా సోదరుడితో సమానం" అంటూ నా భుజం చుట్టూ చేయి వేశారు.

మా నాన్నగారి వల్ల నాకింత ఆదరణ లభించటం నా అదృష్టం - మా నాన్నగారి గొప్పతనం. ఆయనకు మనసులోనే పాదాభివందనం చేసుకున్నాను.

నేను వచ్చిన పనీ - మా ఆర్థిక పరిస్థితి వారికి వివరించినపుడు కృపానిధిగారు నొచ్చుకున్నారు.

"అదేంటోయ్ - డిగ్రీ ఫస్ట్ క్లాసులో పాస్ అయినా నీకింకా ఉద్యోగం దొరకలేదా? అయినా ఇన్నాళ్ళూ నా దగ్గరకు రాకుండా చాలా పొరపాటు చేశావబ్బాయ్! నా నియోజక వర్గంలో ప్రజలు బాధలు పడితేనే సహించలేని నేను - నాకు చదువు చెప్పిన మాష్టారి కుటుంబం కష్టాల్లో ఉంటే చూస్తూ ఎలా భరించగలననుకున్నావు?" అన్నారు.

నాకు ఆనందంతో మాటలు రాలేదు. ఇన్నాళ్ళూ కృపానిధిగారు గుర్తుకు రాకపోవటం చాలా పెద్ద పొరపాటేనని ఇప్పుడనిపిస్తోంది. కనీసం ఇప్పటికైనా నేను సవ్యమైన వ్యక్తిని ఎన్నుకోవటం చాలా సంతోషం అన్పించింది.

కృపానిధిగారి మాటలు విని చుట్టూ ఉన్న వాళ్ళందరూ వారి ఔదార్యాన్నీ, మంచితనాన్ని ఉదారంగా పొగిడారు.

"హైదరాబాద్‌లో మినిస్టర్ దయాసాగరం నాకు చాలా సన్నిహితుడూ - మిత్రుడూ. అతనికి ఉత్తరం రాసిస్తాను, నీకు తప్పకుండా ఉద్యోగం ఇప్పిస్తాడు" అని అభయహస్తం ఇచ్చారు.

దాని పర్యవసానమే ఈనాటి ప్రయాణం.

రైల్లో కూచుని ఆ ఉత్తరాన్ని మరోసారి తీశాను. నామీద నమ్మకంతోననుకుంటాను కృపానిధిగారు ఉత్తరాన్ని కవర్లోపెట్టి కవర్ అంటించకుండా ఇచ్చారు.

ఇప్పటికి నాలుగుసార్లు చదివాను. ఉత్తరాన్నిచదివిన ప్రతిసారీ నాకు ఉద్యోగం ఖాయమనే నమ్మకం బలపడుతోంది.

ఉత్తరం చదవటం ప్రారంభించాను.

"దయాసాగరం గారికి -

నమస్కారం.

చి॥ రామశాస్త్రి మావూరి మాష్టారు పతంజలి శాస్త్రిగారి పెద్దబ్బాయి. నాచేత పలకా బలపం పట్టించి ఓనమాలు దిద్దించిన గురువుగారు శాస్త్రిగారు. ఆ విధంగా రామశాస్త్రి నాకు సోదరుడు - శాస్త్రిగారి మరణం తర్వాత వారి కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది.

రామశాస్త్రి డిగ్రీ ఫస్ట్ క్లాసులో పాసయినాడు. చాలా బుద్ధిమంతుడు. తెలివీ, చురుకుదనం, నిజాయితీ కల కుర్రాడు.

మీరున్నారనే ధైర్యంతో ఉద్యోగం విషయంలో నేను మాట కూడా ఇచ్చేశాను. కాబట్టి మీరు ఈ విషయాన్ని నా స్వవిషయంగా తలచి ఏదో ఒక ఉద్యోగం ఇప్పించమని ప్రార్థిస్తున్నాను.

నేను వచ్చే నెల్లో హైదరాబాద్ వచ్చినపుడు తమరికి మిగతా విషయాలు విన్నవించుకుంటాను.

ఇట్లు,

భవదీయుడు,

కృపానిధి.

తన స్వంత తమ్ముడి విషయంలో అయితే ఎలా రాసి ఉండేవారో అలాన్నే రాశారు.

ఆ ఉత్తరాన్నీ, అందులో పొదగబడిన అక్షరాల్నిచూస్తూ ఉంటే అక్షయ పాత్రని అరచేతిలో ఇముడ్చుకున్నంత ఆనందంగా ఉంది.

"భవదీయుడు" - ఎంత చక్కటి పదమో. నాకీ పదమంటే ఎంతిష్టమో - ఉత్తరం ప్రారంభంలో ఉభయకుశలోపరి రాయటం నాకెంతటి వ్యసనమో అలానే చివర్లో భవదీయుడు అని ముగించటంలో కూడా అంతటి మక్కువ.

సోదర సమానులన్నారు కదా - బహుశా కృపానిధి గారికి కూడా ఆ పదం అంటే నాకు మల్లేనే ఇష్టమేమో.

హైదరాబాద్ చేరుకున్నాక బర్కత్‌పురాలో ఉన్న మినిస్టర్ గారింటిని వెతుక్కుంటూ వెళ్లాను.

ఎక్కువ శ్రమ పడకుండానే ఇల్లయితే చేరుకున్నాను కానీ నాకంటే ముందే నా దురదృష్టం వాలినట్లుంది. మినిష్టరుగారు లేరు - రావడానికి రెండ్రోజులు పట్టుందట. గేట్ కీపర్ చెప్పాడు.

అతను తెలుగువాడే. మొదట నా మాసిన బట్టల్నీ, దైన్యం నిండిన ముఖాన్నీ చూసేమో 'జావ్ . . . జావ్ . . .' అని హిందీలో కసురుకుంటే అతనికి తెలుగు రాదేమోననుకున్నా.

అతను విసుక్కుంటున్నా నేను నమస్కారం పెట్టాను. ఉద్యోగం లేకపోవటం వల్లననుకుంటా ఏ చిన్న ఉద్యోగస్థుడిని చూసినా గౌరవం కలుగుతోంది.

ఆ తర్వాత అతను స్నేహపూర్వకంగా నవ్వి, నా వివరాలన్ని అడిగి తెలుసుకున్నాడు. రెండ్రోజుల తర్వాత వస్తే మినిష్టర్ గారిని కలవొచ్చని చెప్పాడు.

తిరిగి వూరెళ్ళి మరలా వచ్చేంత డబ్బులేదు. ఈ ప్రయాణం కోసమే తెల్సిన వాళ్ళందరి దగ్గరా అమ్మ చేయిచాచిందని తెల్సు. అందుకే రెండ్రోజులు హైదరాబాద్ లోనే ఉండి మినిష్టర్‌గార్ని కల్సి వెళ్ళటానికి నిర్ణయించుకున్నాను.

యుద్ధానికీ, ఉద్యోగానికీ చాలా సామీప్యం ఉంది. పూర్వకాలంలో అయితే రణభూమిలో ముఖాముఖి పోరాడేవారు. కత్తుల్లో, విల్లంబుల్లో ధరించి . . . నిజమైన శక్తి సామర్థ్యాలు - తెలివి - చాకచక్యం కలిగిన వ్యక్తినే విజయలక్ష్మి వరించేది.

ఉద్యోగాలు కూడా అంతే. ప్రతిభ కలవారికి లభించేవి. నేడు పరిస్థితి మారింది. యుద్ధానికి ప్రత్యక్షంగా తలపడనవసరంలేదు. సురక్షితమైన ప్రదేశంలో కూచుని మీట నొక్కితే చాలు, మిస్సైల్స్ దూసుకుంటూ వెళ్ళి లక్ష్యాన్ని ధ్వంసం చేసేస్తాయి.

అలానే ఉద్యోగం రావాలన్నా సరియైన వ్యక్తిని పట్టుకుని, సరియైన మీట నొక్కిస్తే చాలు. ఉద్యోగం మన ఒడిలో పడ్తుంది. నా విషయంలో ఆ వ్యక్తి కృపానిధిగారు, ఆ మీట దయాసాగరంగారు.

రోజంతా హైదరాబాద్ రోడ్లు పట్టుకు తిరగటం - రాత్రి కాగానే కాచిగూడ రైల్వే స్టేషన్లో నిద్ర - ఆకలేసినపుడు ఓ రొట్టెతిని మంచినీళ్లు తాగటం . . . అంతే.

ఎలా అయితేనేం రెండ్రోజుల తర్వాత మంత్రిగార్ని కల్సుకునే మహద్భాగ్యం కలిగింది.

వారికి కృపానిధిగారిచ్చిన ఉత్తరం అందించాను. దాన్ని చదువుకున్నాక ఇంతకు ముందు కన్పించని ఆప్యాయత వారి మాటల్లో . . . మొహంలో ప్రసన్నత - ఆ ఉత్తరం ఏదో మేజిక్ చేసినట్లు . . .

"కృపానిధి నాకు చాల కావల్సిన వ్యక్తి - నీకు ఉద్యోగం తప్పకుండా ఇప్పిస్తాను. ఎటొచ్చీ ప్రస్తుతానికి ఖాళీలు ఎక్కడెక్కడ ఉన్నాయో తెల్సుకోవాలి. అవి తెలిశాక నేను నీకు కబురంపిస్తాను. మరీ అర్జెంట్ అయితే కృపానిధికి ఫోన్ చేస్తాను" తన సెక్రటరీని పిలిచి నా చిరునామా నోట్ చేయించారు.

"డైరీలో ఇతని ఉద్యోగం విషయం రాసి పెట్టండి. ఈ విషయానికి మనం ప్రయారిటీ ఇవ్వాలి. ఇతను మనకు చాలా సన్నిహితుడు" అని చెప్పారు.

వారికి నమస్కారం చేసి శెలవు తీసుకున్నాను. ఇంటికి చేరిన క్షణం నుంచీ ఎదురు చూపులే . . . రాత్రుళ్ళు కలలు . . . ఉద్యోగంలో చేరమని తెలియబరుస్తూ రాసిన ఉత్తరం

అందుకున్నట్లు . . . నేను చీకటి గదిలో కూచుని ఉంటాను. ఎంత ప్రయత్నించినా లైట్ వెలగదు. ఇంతలోనే ఏదో అద్భుతం జరిగినట్లు గదంతా బ్రహ్మాండమైన వెల్తురు . . . కళ్లు నులుముకుని చూస్తే స్విచ్ మీద వేలుంచి మందహాసం చేస్తోన్న కృపానిధిగారు . . . మరో కలలో దాహంతో నాలిక పిడచ కట్టుకుని పోతూ ఆ ఎడారిలో నీళ్ళ పంపును ఆశగా చేరుకుని ఎంత ప్రయత్నించినా బొట్టు రాలదు. ఇక దాహంతో చనిపోతానేమో ననుకుంటున్న క్షణం నన్ను ముంచెత్తుతూ నీటిధార . . . పంపు తిప్పుతూ కృపానిధిగారు . . .

ప్రతివారం వెళ్ళి కృపానిధిగారిని కలుస్తూనే ఉన్నాను. రోజులు గడిచేకొద్దీ నాలో ఆతృత . . . వారాలు నెలలుగా మారాయి. నాలో కొద్ది కొద్దిగా మరలా నిరాశ . . .

"నాకూ విషయం అర్థం కావటం లేదోయ్ - దయాసాగరం మాటయిస్తే వెనక్కి తీసుకునే వ్యక్తికాదు. నీకు తెల్సుకదా మన వూర్లోనే ఎంత మందికి ఉద్యోగాలిప్పించారో! అయినా నీ విషయంలో ఈ జాప్యం ఏమిటో తెలియటం లేదు. ఎంత పని వత్తిడి ఉన్నా ఇలాంటి విషయాలు మర్చిపోరే ! మొన్న నేను హైదరాబాద్ వెళ్ళినపుడు కూడా నీ విషయం గుర్తుచేసి మరీ మరీ ప్రాధేయపడ్డాను" నొచ్చుకుంటూ అన్నారు కృపానిధిగారు.

ఏం మాట్లాడాలో తెలీక దీనంగా కూచున్నాను. అంతా నా ఖర్మ అనుకోవాలేమో . . . నాతో పాటు చదువుకున్న కృష్ణారావుకి కృపానిధిగారి రికమండేషన్ వల్లనే వారం క్రితం ఉద్యోగం వచ్చింది. మరి నా విషయంలో . . .

"మరోసారి వెళ్ళొస్తావేమిటి? ప్రత్యక్షంగా వెళ్లటం వల్ల కలిగే ప్రభావం వేరుగా ఉంటుంది" అన్నారు.

అవసరం నాదికదా, అంగీకార సూచనగా తలూపాను. అప్పటికప్పుడు తన లెటర్‌హెడ్ మీద మరలా ఉత్తరం రాసిచ్చారు.

చెల్లి చెవికున్న లోలాకుల్ని అమ్మేసి - ఆ వచ్చిన డబ్బుతో హైదరాబాద్ ప్రయాణం అయ్యాను.

ఈసారి ఉత్తరం కొద్దిగా ఘాటుగానే రాశారు. ఈ ఉత్తరం చదివితే వెంటనే ఏదో ఒక విధంగా ఉద్యోగం ఇప్పించటం ఖాయం.

హైదరాబాద్ చేరాక నేరుగా మినిష్టరుగారింటికి వెళ్ళాను. నా అదృష్టం ఈ సారి బావున్నట్లుంది. వారు వూళ్ళోనే ఉన్నారు. మరో గంటలో వచ్చేస్తారట.

కూచుని ఏం తోచక - ఆ ఉత్తరం తీసి చదువుకున్నాను.

"గౌరవనీయులైన మినిష్టరు దయాసాగరం గారికి . . .

క్రితంసారి నేను హైదరాబాద్ వచ్చినపుడు మీ దర్శనం చేసుకున్నాను. అపుడు

చి॥ రామశాస్త్రి గురించి, అతనున్న పరిస్థితుల గురించి వివరంగా చెప్పటం జరిగింది.

మీకు మా మీద దయ కలిగినట్లు లేదు. వారి కష్టాల్ని నేను చూడలేకుండా ఉన్నాను. ఈ విషయం గురించే నాకు దిగులుగా కూడా ఉంటోంది.

ఆ అబ్బాయికి ఉద్యోగం దొరికే వరకూ నా ముఖం చూపించాలంటే సిగ్గుగా ఉంది. మీరీవిషయంలో ప్రత్యేక శ్రద్ధ కన్పరచాలని విన్నవించుకుంటూ . . .

మీ,

భవదీయుడు,

కృపానిధి.

దయాసాగరంగారు నన్ను చూడగానే గుర్తు పట్టారు.

"మొన్న కృపానిధిగారు కల్సినపుడు నీ గురించి చాలా గట్టిగా చెప్పారు. అయినా నేను ఆలోచించేది వేరే ఉంది. నీవు గ్రాడ్యుయేట్‌వి. ఏదో చిన్నా చితకా ఉద్యోగంలో చేర్పించడం కంటే కొద్దిగా ఆలస్యమైనా మంచి ఉద్యోగం ఇప్పిస్తే మంచిదని."

"మా ఇంటి పరిస్థితులు బావోలేవు సార్. ఎంత చిన్న ఉద్యోగమైనా చేస్తాను" అన్నాను.

"అవుననుకో – అయినా ఓ విషయం ఆలోచించావా. ఒక ఉద్యోగానికి వందమంది కాచుకుని ఉంటారు. అందులో నాకు మల్లేనే మరి కొంత మంది మినిష్టర్ల రికమండెడ్ వ్యక్తులు ఉంటారు కదా . . . కొన్నిసార్లు రాజీ కుదిరిపోతుంది. అటువంటప్పుడు కొన్నాళ్ళు ఆగటం అనేది అనివార్యం కదా! నీకు తెలుసు – ఈనాటి పరిస్థితుల్లో ఉద్యోగాలు ఎలా గగన కుసుమాలైనాయో . . ."

ఇలా చాలా కారణాలు చెప్పారు – ఆలస్యం ఎందుకవుతుందో వివరించటానికి . . . చివరికి "నీ ఉద్యోగం విషయం నా బాధ్యత – అదంతా నాకు వదిలేసి నిశ్చింతగా వెళ్ళిరా – నీకు తప్పకుండా ఉద్యోగం దొరుకుతుంది. కొద్దిగా ఓపిక పట్టాలి అంతే" అన్నారు.

చేసేదేముంది కనుక . . . తిరిగి ఇంటి ముఖం పట్టాను.

కృపానిధిగారిని కలిస్తే 'వాళ్ళకుండే వత్తిళ్ళు ఎన్నో! కొన్నాళ్ళు ఆగిచూద్దాం' అన్నారు.

ఇంటి పరిస్థితులు రోజు రోజుకీ దయనీయంగా మారుతున్నాయి. కొంతమంది పిల్లలకు ట్యూషన్లు చెప్పటం ప్రారంభించాను.

చెల్లీ, తమ్ముళ్ళ కళ్ళలో ఆనాడు కన్పించిన వెలుగు పూర్తిగా మాయమైంది. ఇంట్లో అందరూ నా ఉద్యోగం గురించి మాట్లాడటం మానేశారు.

నేను కృపానిధిగారిని కల్సుకోవటం మాత్రం మానలేదు. మినుకుమినుకుమంటూ

ఆశ . . . నాలో మాత్రం చావలేదు. ఎప్పుడు వెళ్ళినా ఆప్యాయంగా మాట్లాడే కృపానిధి గారు – అవసరం లేకున్నా జాప్యానికి కారణాలు వివరించి తన ఔన్నత్యాన్ని చాటుకునే దయాసాగరంగారు . . .

వత్తిడికి తట్టుకోలేకనో లేక రోజూ కాళ్ళరిగేలా తిరుగుతోన్న నా మీద జాలి పడో ఓరోజు కృపానిధిగారే "మరోసారి వెళ్ళిరా" అన్నారు.

ఈసారి ఏకంగా మూడు పేజీల ఉత్తరం రాసిచ్చారు. దాంతో పాటు "ఎలాగూ వెళ్తున్నావు కదా. ఈ పార్సెల్ కూడా వారికి అందచేయి" అని ఇచ్చారు.

నల్గురి దగ్గర చేబదుళ్ళు తీసుకుని హైదరాబాద్ బయలుదేరాను.

చాలా ఉద్యోగాలు ఖాళీలు కూడా ఉన్నాయని రూఢీగా తెల్సింది.

నాకు ఏదో ఒక ఉద్యోగం ఖాయం అన్పిస్తోంది.

మొదటి జీతంతో ఉన్న అప్పులన్నీ తీర్చేయాలని నిర్ణయించుకున్నాను. తర్వాత చెల్లెలికి చెవిపోగులు కొనాలి. తమ్ముళ్ళకు మంచి బట్టలు కొనాలి. ఎన్నిపనులున్నాయో . . .

ఆలోచనల్లో మునిగి హైదరాబాద్ చేరుకోవటం కూడా గమనించలేదు.

ఉత్సాహంగా దయాసాగరం గారింటికి వెళ్ళాను. రాత్రికి కానీ రారట. మొదట ఆ పార్సెల్‌ని ఇంట్లో వాళ్ళకు అందచేశాను.

గేట్ కీపర్‌ని విష్ చేశాను. పలకరింపుగా నవ్వాడు.

"ఇంకా పని కాలేదా" అన్నాడు ఎప్పటిలానే.

"కాలేదండీ మొన్న వచ్చినపుడు ఖాళీలు లేవన్నారు. ఇప్పుడు ఉన్నాయట కదా – కృపానిధిగారు ఉత్తరం రాసిచ్చారు" అన్నాను.

"ఏదీ ఆ ఉత్తరం" అని అడిగాడు. తీసిచ్చాను.

మూడు పేజీల ఉత్తరాన్ని చదువుతాడనుకున్నా – చదవలేదు. ఉత్తరం చివర చూస్తున్నాడు.

"ఫోర్జరీ అని అనుమానమా – కాదు – సంతకం కృపానిధిగారిదే" అన్నాను నవ్వుతూ.

"నేను చూస్తున్నది అది కాదు. ఇక్కడ చూశావా . . . 'భవదీయుడు' అని రాశారు. అదే . . . ఇంతకు ముందు ఇచ్చిన ఉత్తరాలు కూడా ఇలానే రాసి ఉంటారు అవునా . . ."

అవునన్నట్లు తలూపాను.

"చూడు తమ్ముడూ . . . నీవెన్ని కష్టాల్లో ఉన్నావో తెల్సిన వాడిని . . . కాబట్టి నీకో రహస్యం చెప్తున్నా విను. నీకెటువంటి సహాయం లభించదు. ఇది వాళ్ళ కోడ్‌వర్డ్. 'భవదీయుడు'

అని రాస్తే ఎందుకూ పనికిరాని కేసు – చెత్త బుట్టలో పడేయి అని అర్థం".

నా భుజం మీద 'అధైర్యపడొద్దు' అన్నట్లు ఓసారి తట్టి మరలా చెప్పడం ప్రారంభించాడు.

"ఉత్తరం చివర 'నమస్కారాలతో' అని రాసి సంతకం చేస్తే – 'మీకందాల్సిన డబ్బుకి నేను జవాబుదారు' అని అర్థం. అంటే కృపానిధి గారు దొరగారి తరఫున వసూలు చేసుకుంటారన్మాట! ఆ ముడుపులన్నీ కలిపి ఒకేసారి చెల్లించుకుంటారు.

మరో కోడ్ ఉంది. ఉత్తరం చివర ఇట్లు తర్వాత కేవలం 'సంతకం మాత్రమే చేస్తే' అన్నీ నచ్చ చెప్పి పంపిస్తున్నాను. మీకు రావల్సింది స్వయానా ముట్ట చెబుతాడు అని అర్థం.

అందుకే ఏ ఆశలు పెట్టుకోకుండా తిరిగి వెళ్ళు. వీళ్ళు మేక వన్నె పులులు. నీకింకా వీళ్ళ నిజ స్వరూపాలు తెల్సినట్టులేదు. రేపు మరలా ఓట్లు కావాలి కదా. అందుకు మనకోసం తమ శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్లు నటిస్తారు.

పేదవాళ్ళ దగ్గర ఏముంటాయి? రక్తమాంసాలు, ప్రేమానురాగాలు తప్ప. వీళ్ళకివి అవసరం లేదు. డబ్బు కావాలి. అదెలాగూ మనం ఇవ్వలేం" అన్నాడు.

నా మనసంతా దిగులుతో – అసహ్యంతో నిండిపోయింది.

ఉత్తరాన్ని చింపే ముందు మరోసారి ఆ అక్షరాల వైపు చూశాను. "భవదీయుడు" అని . . . అవిపుడు భయంకరంగా . . . వికృతంగా కన్పిస్తున్నాయి.

*(ఆంధ్రజ్యోతి వార పత్రిక 1.12.2000)*